కథ

## గ్లోబల్ హాస్పటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన సామాజిక కథ

# కర్మయోగి

ఇలపావులూరి మురళీమోహనరావు

అబ్బబ్బ... ఏమిటి వెధవ సంత అర్ధరాత్రి వేళ? ఇదేమైనా కూటి కొచ్చేదా, గుడ్డ కొచ్చేదా? అర్ధరాత్రీ, అపరాతీ లేకుండా జాగారాలు! ఒక్క పూట తిండిపెట్టని ఈ రాతలు దేనికి? పనికిమాలిన కంచి గరుడసేవ!" విసుక్కున్నది సీతమ్మ.

ముసిముసిగా నవ్వుకున్నాడు రామశాస్త్రి.

గత నలభై సంవత్సరాలుగా సీతమ్మ నోట ఎన్ని సార్లు విన్నాడో ఈ మాటలు! ఇదే చివరి సారి కూడా కాదని ఆయనకు తెలుసు.

"మంచి పాయింటు దొరికిందోయ్. తప్పకుండా మంచి కథ అవుతుంది. ఆలస్యం చేస్తే గుర్తుండదు. రచయిత అనేవాడు ఐడియా వచ్చిన వెంటనే కాగితం మీద పెట్టాలి" అన్నాడు.

"అబ్బో, పెద్ద రచయిత దిగొచ్చాడు! ఈయన రాయకపోతే అవతల ప్రళయం వస్తుంది. అనవసరంగా నా నిద్ర చెడగొట్టడం కాకపోతే తెల్లవారిన తరువాత రాసుకోవచ్చు కదా!"

"ఒకప్పుడు అలాగే రాసే వాడినోయ్. ముసలాణ్నయ్యాను కదా, మతిమరుపు ఎక్కువైంది."

"అయినా మీ చాదస్తం కానీ, ఇంకా ఎవడండీ మీ పాత చింతకాయ పచ్చడి కథలు చదివేది? నాకే నచ్చడం లేదు."

"నేను రాసేది నీ కోసం కాదోయ్. లక్షలాది పాఠకుల కోసం, నన్ను విసిగించకుండా పడుకో" విసుక్కున్నాడు రామశాస్త్రి.

"అంతా నా కర్మ!" తిట్టుకుంటూ అటు తిరిగి పడుకుంది సీతమ్మ.

***

రామశాస్త్రిది వంశ పారంపర్యంగా పురోహితకుటుంబం. తండ్రి కృష్ణశాస్త్రి వద్ద ఎంతోమంది శిష్యులుండేవారు. వారంతా కృష్ణశాస్త్రి వద్ద వైదికవిధులు శ్రద్ధగా నేర్చుకుంటుండేవారు. కానీ



రామశాస్త్రికి పౌరోహిత్యం పట్ల ఆసక్తి ఉండేది కాదు.

"శాస్త్రీ, పౌరోహిత్యం పాడిబర్రె లాంటిది. దీని వల్ల సర్వకాల సర్వావస్థల యందూ, మన జీవనానికి లోటుండదు. తరతరాలుగా మన వృత్తి ఇదే" చెప్పాడు కృష్ణశాస్త్రి.

"నాన్నా, కాలం మారుతోంది. పౌరోహిత్యానికి ఆదరణ తగ్గిపోతున్నది. దీనిని నమ్ముకుంటే బ్రతుకు గడవదు. నేనేదైనా ఉద్యోగం చూసుకుంటాను."

"పిచ్చోడా, ఏ ఉద్యోగమైనా కులవృత్తికి సాటి లేదు. వేల సంవత్సరాలుగా మనను పోషిస్తున్న ఈ వృత్తి నిన్ను మాత్రం పోషించదూ?"

"ఏం వృత్తి ఇది? ఎప్పుడు ఎవడు ఛస్తాడా, వాడి కర్మ చేద్దాం, తద్దినం పెట్టడానికి ఎవడు పిలుస్తాడా అని ఎదురుచూడటం, ఎప్పుడు ఎవరు పెళ్లి చేసుకుంటారా, సంభావనలు తెచ్చుకుందాం-అని చకోరపక్షిలా చూడటం, వారిచ్చే రెండు రాగి పైసలు, ఒక తవ్వ బియ్యం మూట గట్టుకుని డొక్కు సైకిల్ మీద ఇంటికి రావడం. ఎన్నాళ్లు పోయినా ఇదేగా? స్థిరాదాయం వచ్చే మార్గం వెదుక్కుని జీవిస్తాను."

"శాస్త్రీ, ఉద్యోగం అంటే బానిసత్వం. ఒకడి వద్ద నిర్ణీతసమయంపాటు ఖైదీగా ఉండి వాడి ఆదేశాలను పాటించడం. ఇది స్వతంత్రజీవనం. మరోమాట. భారతదేశం వేదభూమి. వైదిక విద్యలకు ఆదరణ ఎన్నటికీ తగ్గదు. మానవుడు ఎంత ఎదిగినా భగవంతుని కాదనలేడు. నా మాట విని విద్య నేర్చుకో."

"నాన్నా, రాబోయేది సైన్సు యుగం. కంప్యూటర్ యుగం. మానవుడు చంద్రమండలం మీదికి కూడా వెళ్తున్నాడు. రాబోయే సంవత్సరాల్లో మన పురోహితులంతా ముతక సంచీలు చేతబట్టి 'భవతి భిక్షాందేహి' అంటూ తిరగాల్సిందే. నా బ్రతుకు నన్ను బ్రతకనీ" వాదించాడు రామశాస్త్రి.

చెవులు మూసుకుని "హరి హరీ!" అన్నాడు కృష్ణశాస్త్రి.

డిగ్రీ పూర్తికాగానే అనేక గవర్నమెంటు ఉద్యోగాలకు ప్రయత్నించాడు రామశాస్త్రి. ఉత్తర దక్షిణాలు లేకా, కులం కారణంగా కొంతా, రామశాస్త్రికి ఏ ఉద్యోగమూ రాలేదు.

మధ్య మధ్యన తండ్రి అనేకసార్లు చెప్పినా రామశాస్త్రి వినలేదు. వయసు పోతే మళ్లీ రాదు అని సీతామహలక్ష్మితో వివాహం జరిపించాడు కృష్ణశాస్త్రి.

పెళ్లానికి మూరెడు మల్లెపూలు కొనాలన్నా, రూపాయి టిక్కెట్టు కొనుక్కుని సినిమా చూడాలన్నా, తండ్రి ముందు చేయి జాపవలసిన పరిస్థితి! తండ్రి విసుక్కుంటూ డబ్బివ్వడం పెద్ద అవమానంగా తోచింది రామశాస్త్రికి. దాంతో భార్య తరపు వారెవరో రికమెండ్ చేస్తే ఒక పొగాకు కంపెనీలో గుమాస్తాగా చేరాడు.

ఈ అత్తెసరు జీతంతో నెట్టుకురాలేక కులవృత్తి వైపు మళ్లుదామా-అని ఒక దశలో ఆలోచించాడు.

కానీ సీతమ్మ ససేమిరా అంది. గుండు చేయిరచుకుని, పిలకపెట్టుకుని, నూలు ధోవతి కట్టుకుని, చేతిలో సంచీ పెట్టుకుని, విస్తళ్లు కుట్టుకుంటూ, దర్భపుల్లలు ఏరుకుంటూ, నస్యం పీల్చుకుంటూ తిరిగే భర్తను తానూహించలేనని తెగేసి చెప్పింది. హాయిగా పాంటూ, షర్టూ వేసుకుని, దర్జాగా ఫాను కింద కుర్చీలో కూర్చుని, నెల తిరగ్గానే నాలుగు వచ్చుకాగితాలు తెచ్చుకోవడం ఎంతో గౌరవమని నూరిపోసింది. దాంతో ఇక ఆ ఆలోచనకు స్వస్తి చెప్పాడు రామశాస్త్రి.

తండ్రి మరణించిన తరువాత బాధ్యతలన్నీ రామశాస్త్రి మీద పడ్డాయి. వచ్చే పోయే ఆడపడచులు, వారికి చీరె, సారె పెట్టడం, బంధువుల ఇళ్లకు పెళ్లిళ్లు పేరంటాలకు వెళ్లడం, తనకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టడం, వారి చదువు సంధ్యలు-ఇలాంటి వాటితో రామశాస్త్రికి తన సంపాదన, ఉద్యోగం ఎంత గొప్పవో తెలిసొచ్చాయి. ఖర్చులు పెరిగినంత వేగంగా ఆదాయం పెరగదని అర్థమైంది. నెలాఖరున చిల్లర మల్లర అప్పులు చెయ్యడం, జీతం రాగానే వాటిని తీర్చడం, నెల చివరి వారంలో మళ్లీ అప్పులు. ఇదే జీవితమైపోయింది.

భవిష్యత్తులో పౌరోహిత్యానికి విలువ ఉండదన్న రామశాస్త్రి అంచనా నిజం కాలేదు. శాస్త్రీయంగా పూజ చేసిన తరువాతనే మానవుడు కంప్యూటరును ఉపయోగిస్తాడనీ, చంద్రమండలం మీద షికార్లు చేసివచ్చిన తరువాత ఇదంతా దేవుడి దయ అంటాడనీ, రామశాస్త్రి ఊహించలేదు. చిన్న చిన్న ఆబ్దికాలకు కూడా నాలుగైదు వందల రూపాయలు దక్షిణ పుచ్చుకునే పరిస్థితి వస్తుందనీ, ఇచ్చినంత పుచ్చుకోవడం కాకుండా కోరుకున్నంత గుంజుకునే స్థాయికి పురోహితులు ఎదుగుతారనీ రామశాస్త్రి అనుకోలేదు.

తన తండ్రి దగ్గర విద్య నేర్చుకున్నవారు కొంత మంది పెద్ద పెద్ద మంత్రులు, ఉన్నతాధికారుల ఇళ్లలో మాత్రమే కార్యాలు నిర్వహించే స్థాయి కొచ్చారు. దర్జాగా కార్లలో తిరుగుతున్నారు. కొంత మందైతే నేరుగా అమెరికా వెళ్లి, అక్కడి దేవాలయాలలో పూజారులుగా, తెలుగు సైంటిస్టుల భవనాల్లో నిత్యపూజలు చేసేవారుగా స్థిరపడి, సంవత్సరాని కోమారు డాలర్ల మూటలతో స్వగ్రామాల కొచ్చి ఇళ్లూ, పొలాలూ కొని, మళ్లీ దర్జాగా విమానాలెక్కేవారిని చూస్తూ రామశాస్త్రి కుమిలిపోతుండేవాడు. మర్యాద కోసం వారు రామశాస్త్రిని కలిసి, "అంతా మీ నాన్నగారి చలువ" అని భక్తితో అంటుంటే, పుండు మీద కారం చల్లినట్లయ్యేది.



"ప్రతిభ చూపించింది"
అని ప్రీతిజింటాను గురించి అంతా అనుకుంటున్నారు. 'కోయీ మిల్ గయా' చిత్రంలో మానసికపరిణతి లేని యువకుణ్ని బాగుచేసిన అమ్మాయిగా చేసింతరువాత, ప్రీతి 'కల్ హో న హో'లో, ఎప్పుడూ డల్‌గా, ముభావంగా వుండే అమ్మాయి పాత్రలో జీవించిందట. ఇద్దరు మిత్రుల సాయంతో ఆమె మళ్లీ యథాస్థితికి వస్తుంది. ఈ పాత్రను ముందు కరీనను చేయమంటే, పారితోషికం తక్కువని నో అనేసిందట. ప్రీతి చక్కని ప్రతిభను కనబరచటంతో, ప్రీతి కెరీర్ తారాపథానికి పోతుందంటున్నారు.

ఒకప్పుడు పురోహితుడంటే సంవత్సరంలో నాలుగు పెళ్లిళ్లు, నాలుగు తద్దినాలు చేసుకొని దాని మీద వచ్చే గ్రాసంతో సంవత్సరమంతా గడుపుకునేవాడు. కానీ నేడు? మనిషి అభివృద్ధి చెందే కొద్దీ దైవభక్తి కూడా పెరిగిపోతున్నది. దాంతో ఎప్పుడు చూసినా ఎవరో ఒకరి ఇళ్లల్లో పూజలు, అర్చనలు, అభిషేకాలు, శాంతులు, వ్రతాలు, నోములు, పంచాంగశ్రవణాలు! పురోహితుల వద్ద పదిమంది అసిస్టెంట్లు. వారిని ఆరు మాసాలు ముందుగా బుక్ చేసుకునే స్థితి!

తండ్రి ఏ నోటితో అన్నాడో కానీ అక్షరాలా బానిసత్వమే చేశాడు రామశాస్త్రి. నిత్యమూ యజమానుల తిట్లూ, చీవాట్లూ, పెరగని జీతంతో రిటైరై ఇంటికొచ్చాడు. యజమానులు చేసే అక్రమాల వల్ల ఇరవైవేలు ప్రావిడెంట్ ఫండు మాత్రమే వచ్చింది. పింఛను ప్రసక్తే లేదు.

ఇక జరుగుబాటు ఎలా? ఈ వయసులో మళ్లీ ఉద్యోగం ఎవడిస్తాడు? ఏదైనా బట్టల కొట్లలోనో, కిరాణా షాపుల్లోనో గుమాస్తాగా చేరమని సలహా ఇచ్చారు బావలు, బావమరుదులు. ముప్పై సంవత్సరాలు, వ్యక్తుల కింద పని చేసి నిత్యావమానాలు భరించిన రామశాస్త్రికి, మళ్లీ అలాంటి చాకిరీ దుర్భర మనిపించింది. కన్నీళ్ల పర్యంత మయ్యాడు.

సీతమ్మ జాలి పడలేదు సరి కదా, మండిపడింది. "ఏడుస్తూ కూర్చుంటే తిండెవడు పెడతాడు? మనకేమైనా ఆస్తులున్నాయా, అంతస్థు లున్నాయా? రెక్కలు వంచనిది పొట్ట ఎలా నిండుతుంది?" అని కేకలేసింది.

ఇరవైవేలు మెల్లగా కరిగిపోతున్నాయి. ఆ సమయంలో విశ్వనాథశాస్త్రి వచ్చాడు. విశ్వనాథశాస్త్రి, రామశాస్త్రి వయసువాడు. కృష్ణశాస్త్రి శిష్యరికం చేసి స్వతంత్రంగా పౌరోహిత్యం, శిష్యప్రశిష్యులతో ఓ పీఠాధిపతిలా విరాజిల్లుతున్నాడు.

తన క్లయింట్లను, వారి వారి ఆర్థిక స్తోమతలను బట్టి వర్గాలుగా విభజించి, తన శిష్యబృందాన్ని పంపుతుంటాడు. అత్యున్నత స్థాయి వారిళ్లకు మాత్రం తను వెళ్తుంటాడు. మాట్లాడుకున్న ఫీజులో ఎనభై శాతం తను తీసుకుని, ఇరవై శాతం వారికిస్తుంటాడు.

రామశాస్త్రి కుటుంబపరిస్థితిని చూసి జాలి పడ్డాడు. ఆ నాడు తనతోపాటు పౌరోహిత్యం నేర్చుకోనందుకు వ్యంగ్యబాణాలు విసిరాడు.

"శాస్త్రీ, నీకు మంచి తిండి పుష్టి ఉన్నదా?" అడిగాడు.

"ఆహా... ముప్పొద్దులా!" బదులిచ్చింది సీతమ్మ.

"నీకు ఏ శ్రమా లేకుండా కడుపు నిండే మార్గం చెబుతాను. వింటావా?" నస్యం పట్టుపట్టి అన్నాడు విశ్వనాథశాస్త్రి.

"రోజంతా కష్టపడ్డా ఒక పూట పొట్ట నిండటమే కష్టంగా ఉన్నది. అటువంటి స్థితిలో ఏ శ్రమా లేకుండా కడుపు నిండటమా?"

"అవునోయ్. నేను చెబుతా. విను. నాకున్న వందలమంది క్లయింట్స్‌లో ఎంత లేదన్నా నెలకు ఇరవై ఆబ్దికాలుంటాయి. ప్రతిదానికీ పురోహితుడితో పాటు ఒక భోక్త కావాలి. కడుపు నిండా తిండితోపాటు రెండొందలు దక్షిణిగా ఇస్తారు. వంద నీకు, వంద నాకు. నెలకు నీ తిండితోపాటు రెండు వేలు ఎక్కడికీ పోవు."

"మరి నాకేమీ మంత్రాలు రావే!?"

"ఏమీ అక్కరలేదు. నోరు ఆడిస్తూంటే చాలు. నువ్వు మంత్రం చదువుతున్న బిల్డప్ ఇస్తే చాలు. గాయత్రీమంత్రాన్ని బట్టీ పట్టు. మధ్య మధ్య దాన్ని గొంతెత్తి చదువు. తతంగమంతా గంటలో అయిపోతుంది. నాలుగు కూరలు, నాలుగు పచ్చళ్లు, పప్పు, గారెలతో కమ్మటి భోజనం దొరుకుతుంది. మానెడో, అడ్డెడో బియ్యంతోపాటు వంద రూపాయలు దొరుకుతాయి."

"కానీ ఈ వయసులో ఈ పనికి అలవాటు పడగలనా?"

"చూడు శాస్త్రీ. నీకు అరవై ఏళ్లొచ్చాయి. ఈ వయసులో జరుగుబాటు కోసం ఏ కోమటి కొట్లోనో చేరి నీ కంటే చిన్నవాళ్లతో చీవాట్లు, చెప్పుదెబ్బలు తినే బదులు హాయిగా నామాట విను. ఏదో మీ నాన్నగారి వద్ద నాలుగు ముక్కలు నేర్చుకున్నాను కదా-అనే విశ్వాసంతో నీకీ అవకాశమిస్తున్నాను." సీతమ్మ తెచ్చిన కాఫీ అందుకున్నాడు విశ్వనాథశాస్త్రి.

"శాస్త్రిగారు చెప్పేదీ నిజమే. తిండి లేక పస్తులుండే బదులు ఇది నయం కదా!" వత్తాసు పలికింది సీతమ్మ.

"వెంటనే మంగలి షాపుకెళ్లి శిఖపాయను వదిలి గుండు చేయించుకో. రేపట్నుంచే నీకు గిరాకీ మొదలౌతుంది" చెప్పాడు విశ్వనాథశాస్త్రి.

ఆ మాట వినగానే గుండెల్లో రాయిపడింది రామశాస్త్రికి. "గుండు చేయించుకోవాలా?" తడబడుతూ అడిగాడు సీతమ్మ వంక చూస్తూ.

ఒకప్పుడు తుమ్మెద రెక్కల్లా నిగనిగలాడుతూ రింగు రింగుల జుత్తుతో వెలిగిపోతున్న భర్త పిలక పెట్టడానికి సుతరామూ అంగీకరించని సీతమ్మ, నేడు ఎండిపోయిన గడ్డిపరకల్లా అక్కడక్కడ కనిపిస్తున్న ఆ నాలుగు వెంట్రుకలను నరికిపారేయడానికి సంతోషంగా అంగీకరించింది. దాంతో ఒకనాడు తండ్రి ఎంత బతిమలాడినా పౌరోహిత్యం స్వీకరించడానికి ససేమిరా అన్న రామశాస్త్రి, నేడు భుక్తి కోసం భోక్తగా మారడానికి బలవంతంగా అంగీకరించాడు. చింతపండుతో తోమిన రాగిచెంబులా తళతళలాడుతున్న గుండుతో ఇంటికొచ్చిన భర్తను చూసి, కన్నీళ్లను దిగమింగుకుంటూ గిరుక్కున లోపలికి వెళ్లింది సీతమ్మ.

***

ఇక రామశాస్త్రి రెండవ కోణం-

రామశాస్త్రికి చదువుకుంటున్న రోజుల్నుంచీ సాహిత్యం పట్ల కొంత మక్కువ ఉండేది. అడపా దడపా కథలు రాసి పత్రికలకు పంపుతుండేవాడు. పది కథలు పంపితే రెండు మూడు అచ్చవుతుండేవి. ఒకటో, అరో, పది రూపాయలు పారితోషికం పంపితే దాన్నెంతో అపురూపంగా చూసుకునేవాడు.

కథ రాయగానే సీతమ్మకు వినిపించేవాడు. "ఏడ్చినట్లుంది" అంటుందామె. కథ అచ్చయితే



"వాడెవడో పనికిమాలిన వెధవ అయి ఉంటాడు" అనేది. తిరుగుటపాలో వస్తే "నేనప్పుడే చెప్పలా? ఎవడంట మీ దిక్కుమాలిన కథ వేసుకునేది?!" అని ఎగతాళి చేసేది. ఏ నాడూ ఏ విషయంలోనూ ప్రోత్సహించేది కాదు.

రామశాస్త్రికి ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలు అనే కంటే పిశాచాలు అనడం సబబుగా ఉంటుంది. రెండు మూడు నెలలకో మారు భర్త, పిల్లలతో సహా వచ్చి పుట్టింట్లో నెలల తరబడి తిష్ఠ వేసేవారు. అల్లుళ్లిద్దరూ పరమశుంఠలు. మామగారి సొమ్ము బాగా తినమరిగినవాళ్లు. ఏ ఉద్యోగమూ నిలకడగా చేయకపోవడంతో పాటు, ఊరంతా అప్పులుచేస్తూ అప్పులవాళ్లు తన్నబోతే పారిపోయి మామగారింటికి వచ్చేవాళ్లు. వీరి పోషణతో రామశాస్త్రి పూర్తిగా క్రుంగిపోయి, ఇంట్లో తరతరాలుగా ఉంటున్న చెంబు తపేళాలు కూడా అమ్ముకునే స్థాయికి జారిపోయాడు.

"ఇలా పుట్టింటి మీద ఎన్నాళ్లు ఆధారపడతారు? కూలో, నాలో చేసుకునైనా మీ బ్రతుకులు మీరు బ్రతకాలి తల్లీ!" అని రామశాస్త్రి చెప్పబోతే, "ఇలాంటి చవటలకిచ్చి మా గొంతు కోశావు. ఈ సన్నాసులకిచ్చే కంటే మా పీక పిసికేయలేకపోయావూ?" అని తండ్రి మీద పోట్లాడేవారు.

నిస్సహాయంగా చూసేవాడు రామశాస్త్రి. కూతుళ్ల సంసారాలతో పూర్తిగా దివాలా తీశాడు.

ఇలా ఏ విధంగా చూసినా సుఖమూ, సంతోషమూ లేని జీవితంలో, కథారచన రామశాస్త్రికి కొంత ఊరట కలిగించేది. కథ గురించి, పాత్రల గురించి, సంభాషణల గురించి ఆలోచించడంతో జీవితసమస్యలను కొంత వరకూ మరిచిపోగలిగేవాడు.

దాదాపు పాతికేళ్లలో నూట యాభై కథలు రాసినా, దురదృష్టవశాత్తూ రామశాస్త్రికి రచయితగా తగిన గుర్తింపు రాలేదు. ఈ నాటికీ రామశాస్త్రి పంపిన కథలు తిరిగొస్తుండేవి. వాటిని చూసి ఎంతో బాధ పడేవాడు.

"నీ కథలలో కొన్నింటిని ఏరి సంకలనాలుగా ప్రచురించు. పెద్ద పెద్ద రచయితలకు పంపించు. ఒక రికార్డులా ఉంటుంది. అలా నాలుగైదు సంకలనాలు ప్రచురించి పత్రికల్లో రివ్యూలు వస్తుంటే నీ పేరు నలుగురి నోళ్లలో నానుతుంది"-సలహా ఇచ్చారు కొంతమంది.

రిటైరైన తరువాత ఇరవై వేలు వచ్చాయి. వాటితో ఒక సంకలనం ప్రచురించా లనుకున్నాడు.

సీతమ్మ రౌద్రురాలైంది. "పెళ్లై ముప్పై ఏళ్లైనా ఇంతవరకూ ముక్కుపుడక కూడా చేయించలేకపోయారు. కనీసం ఈ సొమ్ముతో చేతికి ఒక్కగాజైనా చేయిద్దా మన్న జ్ఞానం కూడా లేకుండా పోయిందా? రేపు నువ్వు ఛస్తే నా నోట్లోకి పిండం పోయేదెట్లా? ఇప్పుడు పుస్తకాలు అచ్చేసి వచ్చిన సొమ్మును గంగపాలు చెయ్యడానికి మనసెలా ఒప్పింది? ఇప్పుడు వాటిని అచ్చేసి లోకాన్ని ఉద్ధరించమని ఎవడు చెప్పాడు?" ఊరంతా వినబడేలా అరిచింది.

రామశాస్త్రి బిక్కచచ్చిపోయాడు.

ఇంతలో కూతుళ్లిద్దరూ వచ్చారు. తమ భర్తలు ఊళ్లో అప్పులు చేసి తన్నులు తిన్నారనీ, ఆ ఇరవైవేలు ఇవ్వకపోతే అప్పటికప్పుడే ఉరి బోసుకుంటామనీ బెదిరించి, మాంసఖండాన్ని గద్దల్లా ఎగరేసుకుపోయారు.


రిటైరైన మర్నాడే ముతకసంచీ చేతపట్టక తప్పలేదు రామశాస్త్రికి. తండ్రికి సంపాదన లేకపోవడంతో కూతుళ్లు, అల్లుళ్ల రాక చాలా వరకు తగ్గింది.

***

దీపావళి పండుగ సందర్భంగా అమెరికాలో ఒక సంస్థ వారు నవలల పోటీ ప్రకటించారు.

## అది శారూఖ్ పని కాదు!

కిశోర్ లుల్లా చిత్రం 'ఖాకీ' విడుదల ఆలస్యం కావటంలో 'బాద్షా' శారూఖ్ ఖాన్ హస్తముందని తాజాగా వినిపిస్తున్నది. నిజానికి ఇది, ఆ చిత్రం డిస్ట్రిబ్యూటర్ పనేనని తేలింది. విదేశాల్లో ఆక్షన్ చిత్రాలు అంతగా నడవవు కనుక, 'ఖాకీ' విడుదల కావాలనే ఆలస్యం చేయించాట్ట. అక్కడ నడిచేవన్నీ రొమాంటిక్ లవ్ స్టోరీసేనట! అందులోనూ కరణ్ జోహార్, శారూఖ్ కాంబినేషన్‌లో వుంటే మరింత హాట్ కేకే! విదేశీచిత్రాల్లో కావలసినంత ఆక్షన్ వుంటుంది కనుక రొమాంటిక్ చిత్రాలు కావాలని ఎన్నారైల కోరికట!



ఒకే ఒక్క నవల. రెండు లక్షల రూపాయల బహుమతి. తెలుగుదేశంలోని హేమా హేమీలంతా కలం పట్టారు. రామశాస్త్రి కూడా కలంలో సిరా పోశాడు. దానికి కావలసిన సంభాషణల కోసం, సన్నివేశాల కోసం నిరంతరం ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండసాగాడు. ఎప్పటి లాగానే సీతమ్మ నసుగుడు, చిరాకూ మొదలయ్యాయి. అర్ధరాత్రి ఎప్పుడైనా మంచి ఐడియా ఏదైనా రాస్తే, వెంటనే లేచి కాగితం మీద పెట్టాడు. నవల దాదాపు పూర్తి కావచ్చింది.

"ఆకలేస్తోందోయ్. వడ్డించు" అన్నాడు భార్యతో.

పీట మీద కూర్చున్నాడు. వెండి కంచం తెచ్చి భర్త ముందు పెట్టింది సీతమ్మ.

ఆశ్చర్యపోయాడు రామశాస్త్రి. "ఏమిటి విశేషం? ఆకు విస్తరి బదులు వెండి కంచం పెట్టావు. దీన్లో తింటానికి నా నవలకప్పుడే బహుమతి రాలేదుగా?" నవ్వాడు.

"దీంట్లో అన్నం తినడానికి కాదు. దీన్ని అమ్ముకుని తినడానికి!" చెప్పింది సీతమ్మ.

రామశాస్త్రి శరీరం బిగుసుకుపోయింది. "ఇంట్లో బియ్యం లేవా?" అతికష్టంగా అడిగాడు.

"నాలుగు రోజుల క్రితం మీరు తెచ్చిన రెండు శేర్ల బియ్యం అయిపోయాయి. మళ్లీ ఎవరైనా మిమ్మల్ని తద్దినానికి పిల్చే దాకా దీంతో సర్దుకుందాం" అన్నది సీతమ్మ.

నీరసంగా లేచాడు రామశాస్త్రి. "పురోహితుల ఫీజులు భరించలేక చాలామంది గుళ్లల్లో పెట్టేస్తున్నారు. పైగా వైదికకర్మల పట్ల ఆసక్తి తగ్గిపోతున్నది. అయినా ఈ విస్తరి ఏభై ఏళ్ల నాడు పెళ్లిలో మీ నాన్నగారు చదివించినది" అన్నాడు.

"చూసి బాధపడటానికి ఇప్పుడు ఆయన లేడుగా? వెళ్లి రండి." మంచం మీద నడుము వాల్చింది సీతమ్మ.

అరగంటలో తిరిగొచ్చాడు రామశాస్త్రి. "చూశావా! మీ నాన్న ఎంత మోసం చేశాడో? దీన్లో సగం ఇనుమేనట! వంద రూపాయలిచ్చాడు షావుకారు!" కోపంగా అన్నాడు రామశాస్త్రి.

"ఏం పరవాలేదు. చచ్చిన పాతికేళ్ల తరువాత కూడా నాలుగు రోజులు తిండి పెట్టాడు" కళ్లొత్తుకుంది సీతమ్మ.

రామశాస్త్రి నవలారచనలో మునిగిపోయాడు.

***

వారం రోజులు గడిచాయి.

రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికొచ్చాడు రామశాస్త్రి. అల్మారా లోంచి తెల్లకాగితాలు తీసుకుంటూ బియ్యపు డ్రమ్ము మూత తీశాడు. అరసోలకు కొంచెం తక్కువగా ఉన్నాయి. గుటకలు మింగాడు రామశాస్త్రి. రాసుకోవడానికి కూర్చుంటూ, "రేపు శంకర్రావుగారి అమ్మగారి ఆబ్దికం. పదకొండింటికల్లా రమ్మన్నారు. నీ వరకు వంట చేసుకో" అన్నాడు.

మరునాటికి బియ్యం లేవని చెప్పబోతున్న సీతమ్మ ఊపిరి పీల్చుకుంది.

ఆ రాత్రి ఒంటి గంట వరకు కూర్చుని నవల రాయడం పూర్తి చేశాడు రామశాస్త్రి. కాగితాలన్నింటినీ జాగ్రత్తగా వరుసలో పెట్టి కలిపి దారం కట్టాడు. అలమరలో పెట్టి పడుకున్నాడు.

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలకు స్నానం చేసి సంచి తీసుకుని బయటకెళ్లాడు.

సాయంత్రం ఖాళీసంచితో ఇంటికొచ్చిన భర్తను చూసి "బియ్యం లేవా?" అని అడిగింది సీతమ్మ.

"ఆ శంకర్రావు ఒట్టి దరిద్రుడు. గిద్దెడు బియ్యం పళ్లెంలో పొయ్యడానికి గిలగిల లాడిపోయాడు. ఆ కాసినీ పేరిశాస్త్రి తీసుకుపోయాడు" సంచి మూల పారేశాడు రామశాస్త్రి.

"మరి సంభావన?"

"పాతిక రూపాయలిచ్చాడు పాపాత్ముడు. నా నవలకు పోస్టు ఖర్చులు వెళ్లిపోతాయి" అలమరలో చెయ్యిపెట్టాడు.

అలమరలో కాగితం అన్నమాట కనిపించ లేదు.

"సీతా... ఈ అలమరలో పుస్తకాలన్నీ ఏవి? నేను రాసిపెట్టిన నవల కూడా కనిపించడం లేదు. ఏమయ్యాయి?" కంగారుగా అరిచాడు.

"ఎందుకవి దుమ్ముకొట్టుకుంటూ అలమరలో అడ్డం? మధ్యాహ్నం పాత పేపర్ల వాడొస్తే ఇరవై రూపాయలకు అమ్మేశాను. రెండు కిలోల బియ్యం తెచ్చాను" చెప్పింది సీతమ్మ.

రామశాస్త్రి ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. పూనకం వచ్చిన వాడిలా నిలువెల్లా ఊగిపోయాడు. "ఆ...!? ఎంత పనిచేశావే దుర్మార్గురాలా? ఆర్నెల్ల నుంచీ రాత్రింబగళ్లు కూర్చుని రాసిన నవలను ఇరవై రూపాయల కమ్మేశావా? నువ్వు మనిషివా, పశువ్వా?" వణుకుతున్న కంఠంతో అరిచాడు.

"మరేం చెయ్యమంటావు? అమ్మడానికి ఇంకేం లేవు. తద్దినముందని అబద్ధం చెప్పి వెళ్లిపోయావు. సాయంత్రం దాకా వస్తుండి ఇంటి కొస్తావనీ, రాగానే ఇంత ఉడకేసి పెట్టాలనీ అనుకున్నాను. శంకర్రావు భార్య మధ్యాహ్నం మనింటికొచ్చింది. అత్తగారి తద్దినమై ఆరు మాసాలు కూడా కాలేదట. ఇంట్లో బియ్యం లేవని గ్రహించి తద్దినం వంక పెట్టి వెళ్లిపోయావని అర్థమైంది. అయినా మీ నవల ఎవడు చూస్తాడు?" కీచుగొంతుతో అరిచింది సీతమ్మ.

"నోర్ముయ్!" పట్టరాని ఆగ్రహంతో చెయ్యెత్తాడు రామశాస్త్రి.

"ఒంటి మీద చెయ్యి పడితే చెయ్యి విరుగుతుంది. ఏభై ఏళ్లు జీవచ్ఛవంలా నీతో కాపురం చేసిన ఇల్లాలి మీద చెయ్యెత్తడానికి సిగ్గు లేదూ? ఏం పెట్టి పోషించావని నామీద నీ అధికారం? రేపు నువ్వు ఛస్తే నేను కూడా చావాల్సిన పరిస్థితిలో ఉంచావు నన్ను!" భద్రకాళిలా అరిచింది సీతమ్మ.



అంతే! రామశాస్త్రి హృదయం బద్దలైంది. మెదడు చిట్లిపోయింది. కాళ్లూ, చేతులు చచ్చుబడిపోయాయి. శరీరమంతా వణుకుతుండగా విరుచుకుపడిపోయాడు.

సీతమ్మ పెట్టిన కేకలకు, ఇరుగుపొరుగంతా వచ్చారు. దగ్గర్లోని డాక్టరును తీసుకొచ్చారు. షాక్‌తో గుండె ఆగిపోయిందని చెప్పి వెళ్లిపోయాడు డాక్టర్.

మూడు గంటల్లో కూతుళ్లు, అల్లుళ్లు వచ్చారు.

"నన్ను నట్టేట ముంచాడు. దిక్కు లేని పక్షిని చేశాడు. ఇంట్లో చిల్లిగవ్వలేదు. రేపట్నుంచి ఎట్లా బ్రతకాలి? డెబ్బయి ఏళ్లు బ్రతికినా కాణీ దాచి పెట్టింది లేదు. నా జీవితం నాశనం చేశాడు. నన్ను రోడ్డు మీద పడేశాడు!" అందరూ వినేట్లుగా శోకాలు పెట్టింది సీతమ్మ.

"నిన్నేనా? నీతో పాటు మా గొంతులూ కోశాడు. ఏబ్రాసి వెధవలకిచ్చి మమ్మల్ని నరకంలోకి తోశాడు. పుట్టింటి కొచ్చినా చేతిలో పది రూపాయలు పెట్టి ఎరగడు!" తిట్టిపోశారు కూతుళ్లు.

వీధిలో వారంతా చందాలు వేసుకుని శ్మశానానికి తీసుకెళ్లి దహనసంస్కారాలు చేయించారు.

వేలాదిమంది కర్మలకు, ఆబ్దికాలకు వెళ్లి తృప్తిగా భోజనం చేసి వారి వారి పితృదేవతలను సంతృప్తి పరచిన రామశాస్త్రి, చిన్న మంత్రానికీ, పిసరంత పిండానికీ కూడా నోచుకోకుండా జంతువులా తగలబడిపోయాడు.

డబ్బు ఖర్చు చేసి కర్మకాండలు జరిపించడం దండుగ అని చెప్పి కూతుళ్లిద్దరూ ప్రయాణ మయ్యారు మర్నాడే.

"అమ్మా, మరి నా సంగతి? ఈ వయసులో నేను ఎవరి పంచన చావను?" ఏడ్చింది సీతమ్మ.

"చచ్చిన నీ మొగుడి నడుగు. మా కొంపలకు మాత్రం రావద్దు. మేమిక నీ కొంపకు రాము. నాలుగిళ్లలో వంటలు చేసుకో!" చెప్పి వెళ్లిపోయారు కూతుళ్లు.

ఇరుగు పొరుగువారి సాయంతో నెల రోజులు నెట్టుకొచ్చింది సీతమ్మ.

ఆ రోజు మధ్యాహ్నం వాకిట్లో ఒక స్కూటర్ ఆగింది. పాతికేళ్ల కుర్రవాడు వచ్చాడు.

"ఇక్కడ రామశాస్త్రి గారంటే ఎవరు?" అడిగాడు.

"ఆయన పోయారు నాయనా. ఎవరు మీరు?" అడిగింది సీతమ్మ.

"అమ్మా. నేను పాతపేపర్ల వ్యాపారం చేస్తుంటాను. ఆ మధ్య ఒక కుర్రాడు అమ్మిన పాతపేపర్లు, పుస్తకాలను వేరు వేరు చేస్తుండగా లావాటి కాగితాల కట్ట దొరికింది. ఏమిటా అని చూశాను. అమెరికాలోని తెలుగు సంస్థవారి ప్రకటన, నవల మీద రామశాస్త్రి గారు రాసిన హామీపత్రం కనిపించాయి. ఇదేదో పొరపాటున వచ్చి ఉంటుందని గ్రహించి, సరదాగా ఆ నవలను నా కేరాఫ్ అడ్రసుతో పోస్టులో పంపాను. ఆ నవల ఉత్తమనవలగా రెండు లక్షల రూపాయల బహుమతికి ఎంపికైనట్లు తెలియజేస్తూ సంస్థ వారు డ్రాఫ్టు పంపించారు. దాన్ని చూడగానే ఒక మహాత్కార్యాన్ని భగవంతుడు నా చేత చేయించాడని భావించి, ఆ మహారచయితకు ఈ డ్రాఫ్టును అందజేసి పోదామని వచ్చాను. వారు పోవడం తెలుగు సాహిత్యరంగం దురదృష్టం! ఇదుగోండమ్మా" డ్రాఫ్టును సీతమ్మకు అందించాడు యువకుడు.

సీతమ్మ శరీరం వణికిపోయింది. కాసేపు చేష్ట లుడిగిపోయింది. రామశాస్త్రి ఫొటో వంక చూసింది.

"నిన్ను రోడ్డు మీద పడనివ్వనులే!" అని నవ్వుతున్నాడు రామశాస్త్రి.

■